క్లుప్తంగా

9 నుంచి శాంతి సద్భావన పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డి.వి.సూర్యారావు, పిల్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), వంద విదేశీ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్రకు శ్రీకారం చుట్టారని సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు అన్నారు. కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానా సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ సారథ్యంలో ఈ నెల 9న శాంతి సద్భావన యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 2023–25 మధ్య కాలంలో రెండేళ్లపాటు 100 దేశాల్లో 130కి పైగా సభలు జరుగుతాయని వెల్లడించారు. పిల్లా వెంకటరమణమూర్తి, శేఖరమంత్రి ప్రభాకర్, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అలరించిన 'భామా కలాపం'



నృత్యం చేస్తున్న భాగవతారిణి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో శుక్రవారం తూర్పు భాగవతం భామా కలాపం ప్రదర్శన జరిగింది. సత్యభామగా గరుడ అవార్డు గ్రహీత లక్ష్మీ భాగవతారిణి చక్కని అభినయం చేశారు. నర్తకి గానం చేస్తూ నృత్యం చేయడం భామా కలాపంలో విశేషం. డి.వి.జగన్నాథరావు పంతులు మృదంగంతో సహకరిస్తూ వ్యాఖ్యానం చేశారు. ఆర్.అప్పలనాయుడు, వై.సూరప్పలనాయుడు వంత పాడగా, బి.పుల్లయ్య హార్మోనియంతో వాద్య సహకారం అందించారు. జగన్నాథరావు పంతులు మూడు మృదంగాల లయ విన్యాసం ప్రదర్శించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సారథ్యంలో నిర్వహించిన కళా ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది.

జాబ్ మేళాలో 81 మందికి ఉద్యోగాలు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 305 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 186 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 81 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాల కల్పనకు ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు



క్యాడెట్లను అభినందిస్తున్న బుల్లయ్య కాలేజీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన నౌసైనిక్ క్యాడెట్లు ఎండీ ముబీన్, ఎ.విజయ్‌కుమార్, వాయు సైనిక్ క్యాడెట్లు పవన్ కార్తికేయ, రామ్ నారాయణలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ముంబయిలోని లోనావాలలో జరిగిన అఖిల భారత నౌసైనిక్ శిబిరంలో ముబీన్, విజయ్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహళ్లి, బెంగళూరులో జరిగిన అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో పవన్, రామ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి, ఫ్లయింగ్ అధికారి బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు అభినందించారు.

అద్భుత కార్యక్రమం.. జగనన్న ఆరోగ్య సురక్ష

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- పేదలకు ఉచితంగా వైద్య సేవలు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు



45వ వార్డు శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు



కప్పరాడ యూపీహెచ్‌సీలో కేస్ షీట్, మందులు అందిస్తున్న కె.కె.రాజు, కామేశ్వరి, వైద్యులు



47వ వార్డు వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు



వాసుదేవనగర్ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేయించుకుంటున్న స్థానికులు

తాటిచెట్లపాలెం: దేశ చరిత్రలో ఇంత వరకు ఏ రాష్ట్రంలోను, ఏ ముఖ్యమంత్రి చేపట్టని గొప్ప కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. 45వ వార్డు వాసుదేవనగర్‌లోని సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలిసి ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి సుమారు 172 రకాల మందులు(మాత్రలు, ఇంజక్షన్స్, సిరప్స్, వాక్సిన్స్, ఆయింట్‌మెంట్స్, పౌడర్స్ వంటివి) ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందని గుర్తెరిగిన ముఖ్యమంత్రి జగన్ ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ శిబిరాల ద్వారా వేలాది మంది ఉచితంగా తమ ప్రాంతాల్లోనే వైద్య సేవలు, పరీక్షలు చేయించుకుంటూ, మందులు కూడా తీసుకుంటున్నారని తెలిపారు.

అందుబాటులో ఆరోగ్య సురక్ష యాప్

దేశంలోనే మొట్టమొదటిసారిగా జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను రూపొందించి ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో దీనిని అందుబాటులో ఉంచుకునేలా ప్రజలకు సిబ్బంది తెలయజేస్తున్నారని కె.కె.రాజు చెప్పారు. దీని వల్ల ప్రజలకు ఎప్పుడు ఏ వైద్య సహాయం కావాలన్నా అత్యంత వేగంగా, సమీపంగా ఉన్న వైద్య సేవలతోపాటు ఆ వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమాచారం కూడా ఈ యాప్‌లో భద్రపరిచారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ 3,200కు పైగా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీని అమలు చేసేలా చట్టం తీసుకొచ్చారని, సుమారు 3 వేల పైచిలుకు వ్యాధులకు సంబంధించి ఆరోగ్యశ్రీ వర్తించేలా చేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ మెంటర్ అంబటి శైలేష్, వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది, యూపీహెచ్‌సీ, జీవీఎంసీ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి పెదకొత్తూరు, రాంజీ ఎస్టేట్ సచివాలయానికి సంబంధించి కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలను, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుంటే.. పచ్చ మీడియా తప్పుడు రాతలు రాయడం దారుణమన్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కామేశ్వరి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. సుమారు 682 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, పార్టీ నాయకులు కొరిబిల్లి విజయ్, గురువోజీ, కృపా, రమేష్, రాఘవులు, సవరపు జయకుమార్, వాసు, నాగరాజు సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన లేమితో తప్పుడు రాతలు

ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన, చైతన్యం వస్తే తమ వారు నష్టపోతారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో చిరకాలం గుర్తుండిపోతారని భయపడి కొన్ని పత్రికలు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులపై తప్పుడు కథనాలు రాస్తున్నాయని సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ప్రతి రోజు వేల కొలది ప్రజలు ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుంటుంటే ప్రజలు రావడం లేదని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, వీరంతా నిజాలు తెలుసుకుని రాయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను ప్రచురించాలని కోరారు. అవగాహన లేని, జర్నలిజం విలువలు పాటించని కొందరు మాత్రమే ఇటువంటి కథనాలు ప్రచురిస్తారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఆయన అన్నారు.

చెంతకే వైద్య సేవలు భేష్



ప్రజల చెంతకే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయం. కాలనీల్లో శిబిరం నిర్వహించి, వైద్యులు పరీక్షలు చేయడం, మందులు అందించడం చాలా బాగుంది. మా ఆరోగ్యం కోసం శ్రద్ధ తీసుకుంటున్న సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– పి.శంకరరావు, లక్ష్మీనారాయణపురం, 45వ వార్డు

ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో మాలాంటి వారు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది. మా దగ్గరే వైద్య పరీక్షలు చేస్తూ, మందులు అందజేస్తున్నారు. ఉచితంగా వైద్య సేవలు పొందడం సంతోషంగా ఉంది.

– కె.కుమారి, తాటిచెట్లపాలెం, 45వ వార్డు

వైద్య శిబిరాలకు స్పందన అమోఘం



జీవీఎంసీ జోన్–5 పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. వార్డు యూపీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాల ప్రజలకు అనేక రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

– డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జోన్–5

ప్రజల్లోకి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో సమీక్షిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు, మండల ఇన్‌చార్జులు, డైరెక్టర్లతో పార్టీ మండల కమిటీల నియామకం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఓటరు లిస్టు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అద్భుతంగా జరుగుతోందన్నారు. ప్రజలకు ఖర్చులేని వైద్యం సీఎం వైఎస్ జగన్ అందించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, బర్కత్ ఆలీ, కెవిఎన్ శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, పార్టీ మండల అధ్యక్షులు జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, బులుసు జగదీష్, అమర్‌రెడ్డి, కర్రి మురళీకృష్ణ, మహిళా అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి, పి.సునీత, డి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు పైడి శ్రీను, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌లో నివసిస్తున్న చిట్టిబోయిన సన్యాసిరావు(44) అనే ఆటో డ్రైవర్‌కు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఇతడికి మద్యపానం అలవాటు ఉంది. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో చెక్కదూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరొకరు..

కంచరపాలెం ఐటీఐ సిద్ధార్థనగర్‌కు చెందిన చొక్కాకుల మోహన్‌బాబు(43) సెంటరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి మతిస్థిమితం లేక చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి వివాహం కాలేదు. మృతుడి తల్లి శాంతి ఫిర్యాదు మేరకు ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు, వెంకటరమణ

మర్రిపాలెం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. 51వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో మేయర్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ముఖ్య అతిథులుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో నగరంలో ఏ మూల చూసినా అభివృద్ధే కనిపిస్తోందని కొనియాడారు. మాధవధార వుడా కాలనీ, రాజీవ్‌నగర్, చిట్టిబాబు కాలనీలకు సంబంధించి రూ.1,76,95,000 వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రెయిన్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. 51వ వార్డుకు సంబంధించి దాదాపు రూ.20 కోట్ల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేయడం గొప్ప విషయమన్నారు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సరిగ్గా జరగడం లేదని పలు పత్రికల్లో వెలువడుతున్న తప్పుడు రాతలను ఆయన ఖండించారు. ప్రజల చెంతకే వైద్యం అందిస్తుంటే ఇలా రాయడం సరికాదన్నారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటి వరకూ వార్డులో రూ.20 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

'ఈ–పోస్' ద్వారా 24 సేవలు

జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పీవోఎస్(ఈ–పోస్) మిషన్ ప్రారంభించామని, వీటి ద్వారా ఇంటి పన్ను వంటి 24 సేవలకు సంబంధించి బిల్లులు కట్టవచ్చని మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజులకు వివరించారు. ఆయా లావాదేవీల విషయంలో ఈ మిషన్‌ను అడ్మిన్ సెక్రటరీ ప్రజల చెంతకే తీసుకెళ్లి వారు కట్టాల్సిన ఇంటి పన్ను, తదితర పన్నులు వారి ఇంట్లో నుంచే కట్టుకునే వీలు కల్పించామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, డైరెక్టర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



పథకాల బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 25వ వార్డు రెల్లి వీధి–1 సచివాలయం పరిధిలో మధురానగర్, చాకలి గెడ్డ ప్రాంతంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలు వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, హరికృష్ణ, మువ్వల సంతోష్, వెంకటేష్, అశోక్, అప్పన్న, గౌరినాయుడు, కొండలరావు, సన్నీ, వీరమ్మ, రత్నం, కొటి, జయ, పద్మ, సంధ్య, శ్రీను, శ్రావణ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గోడ కూలి కార్మికుడి మృతి



సూర్యనారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: రోడ్డు విస్తరణ పనుల సమయంలో గోడ కూలిన ఘటనలో ఒక కార్మికుడు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. విజయనగరం జిల్లా రాజాం, వేపాడ ప్రాంతాలకు చెందిన బండి సూర్యనారాయణ(53), తాతారావు(59)లు 30 ఏళ్ల కిందట విశాఖకు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఎన్‌ఏడీ దుర్గానగర్‌లో నివసిస్తున్నారు. అక్కయ్యపాలెం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం అక్కడ వీరిద్దరూ కలిసి పనిచేస్తున్న సమయంలో క్రెన్‌తో ప్రహరీ గోడ తీశారు. అది ఇద్దరిపై కూలిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో బండి సూర్యనారాయణ మృతి చెందాడు. తాతారావును 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఘటనా స్థలానికి సీఐ విజయకుమార్, సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు కేజీహెచ్‌లో సూర్యనారాయణ మృతదేహాన్ని సీఐ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నేర నియంత్రణపై అవగాహన

కంచరపాలెం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం 55వ వార్డు కంచరపాలెం పరిధి యల్లబిల్లివారి వీధి, జోగారావు నగర్ ప్రాంతాల్లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ ఎన్.సాయి సైబర్ నేరాలు, దొంగతనాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. దుకాణ సముదాయాలు, ఆటో స్టాండ్లు, అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు, సంఘాల భవనాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు భద్రత ఏర్పాటు చేశామన్నారు. దళిత నాయకురాలు డాక్టర్ ఈతలపాక సుజాత, ఈశ్వరరావు, రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతో ఏదైనా సాధించవచ్చు



బదిలీపై వెళ్తున్న సీఐ సింహాద్రినాయుడిని సత్కరిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

సీతమ్మధార: తోటి సిబ్బంది సహకరిస్తే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని బదిలీపై వెళ్తున్న ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శుక్రవారం ఆయనను ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. బాధ్యతగా విధులు నిర్వహిండమే సింహాద్రినాయుడి ధ్యేయమని సిబ్బంది కొనియాడారు. అనంతరం సీఐ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఎయిర్‌పోర్టు ఇమిగ్రేషన్ సీఐగా బదిలీ అయ్యారు. శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరిస్తారు. కార్యక్రమంలో స్టేషన్ రైటర్ శ్రీనివాసరావు, రమణ మూర్తి, ఏఎస్‌ఐలు ప్రసాద్, సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చందనోత్సవం



చందనోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్‌– ఈ– అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్వీ షరీఫ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లింలు వేకువజామున ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అనంతరం మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. మర్రిపాలెం హుస్సేన్‌నగర్ తదితర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంతంలోని హజ్రత్ గౌస్ పాక్ నిషానీ వద్ద పుష్పగుచ్ఛాలతో చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించారు. కార్యక్రమాన్ని మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి వలీ, నూరి, బాషా తదితరులు పర్యవేక్షించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 4లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. వయసు సుమారు 65–70 ఏళ్లు ఉంటుంది. తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, గ్రే కలర్ ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ జీఆర్పీకి గానీ 94406 27547, 98491 67612 నంబర్లలో గానీ తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http@// visakhapatnam. nic. in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

యోగా పోటీల్లో త్రినాథ్ ప్రతిభ



యోగాసనంలో హరగోపాల్ స్కూల్ విద్యార్థి త్రినాథ్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ హరగోపాల్ స్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థి యు.త్రినాథ్ అండర్–17 కేటగిరీ యోగా పోటీల్లో ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దరి వీరవాసరంలో నిర్వహించిన యోగా(ఆర్టిస్టిక్) విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. శుక్రవారంతో ఈ పోటీలు ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యా సంస్థల నుంచి పాల్గొన్న వారందరిలో త్రినాథ్ సెకండ్ ప్లేస్‌లో నిలిచి ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, సిబ్బంది త్రినాథ్‌ను అభినందించారు.